# 23

# బాప్తిస్మమిచ్చు యోహాను మరియు యేసు

## (11:1-19)

అటుతరువాత మత్తయి తన దృష్టిని యేసు చేసిన ఉపదేశములు మరియు కార్యముల పట్ల ప్రదర్శించిన ప్రతిస్పందనలపై కేంద్రీకరించాడు. ఈ ప్రతిస్పందనలు తరచుగా ప్రతికూలమైనవై యుండినవి. బాప్తిస్మమిచ్చు యోహాను సహితము ప్రభువును ప్రశ్నించాడు.[1] యోహాను మరియు యేసు గూర్చి చర్చించిన పిదప (11:1–19), పశ్చాత్తాపపడని పట్టణములను యేసు బహిరంగముగా నిరసించుట గూర్చి మత్తయి నివేదించాడు (11:20–24), యేసు ప్రార్థనను గ్రంథస్తం గావించాడు, మరియు ఆయన యొద్దకు వచ్చుటకు అందరు అహ్వానితులే అంటూ ఆయన అందజేసిన ఆహ్వానమును అటుతరువాత చిత్రీకరించాడు (11:25–30).

### యోహాను అడగిన ప్రశ్న (11:1–3)

**1యేసు తన పండ్రెండుమంది శిష్యులకు ఆజ్ఞాపించుట చాలించిన తరువాత వారి పట్టణములలో బోధించుటకును ప్రకటించుటకును అక్కడనుండి వెళ్లిపోయెను.**
**2క్రీస్తు చేయుచున్న కార్యములను గూర్చి యోహాను చెరసాలలో విని–రాబోవు వాడవు నీవేనా, మేము మరి యొకనికొరకు కనిపెట్టవలెనా? 3అని ఆయనను అడుగుటకు తన శిష్యులనంపెను.**

**వచనము 1.** ఈ మాటలతో, **యేసు తన పండ్రెండుమంది శిష్యులకు ఆజ్ఞాపించుట చాలించాడని** మత్తయి సూచించుచున్నాడు. అదియైన తరువాత, ఆయన 11 మరియు 12 అధ్యాయములలో పరస్పరము ప్రభావము కలిగియుండిన చర్యలను ఇతరులతో మొదలుపెట్టాడు. జాక్ పి. లూయిస్ ఇలా వ్యాఖ్యానించాడు,

> స్టీఫెన్ ల్యాంగ్టన్ చేత 1228లో సమకూర్చబడిన 10 మరియు 11 అధ్యాయముల మధ్య గల విభజన దురదృష్టకరమైనదై యున్నది, ఏలయనగా వాస్తవమునకు ఈ మొదటి వచనము 10వ అధ్యాయము ముగింపునకు రూపమిచ్చుచున్నది. మత్తయి వ్రాసిన సువార్తలో గల ఉపదేశముల విభాగముల ముగింపునకు రూపమిచ్చుచున్న ఐదు వాక్యములలో ఇది రెండవ వాక్యమై యున్నది (7:28 మొదలుకొని; 13:53; 19:1; 26: 1 పోల్చి చూడు).[2]

11:1లో వ్రాయబడియున్న "తన పన్నెండుమంది శిష్యులు" గూర్చిన ప్రస్తావన 10:1లో రిఫరెన్స్‌కు సమాంతరముగా ఉంటూ, ఈ రెండింటిని 10వ అధ్యాయమునకు యిరువైపుల గల ఆధారంగా (book-ends వలె) చేయుచున్నది.

మత్తయి వాస్తవమును సుస్పష్టముగా వెల్లడించనప్పటికిని, శిష్యులు బయలుదేరి వెళ్లిన తరువాత, వారు చేయవలెనని **యేసు** వారికి అధికారమిచ్చిన పనులు చేయుటకు వెళ్లారు

(మార్కు 6:12, 13; లూకా 9:6). కనీసము కొంతకాలము వరకైనా, యేసు ఒంటరిగానే పరిచర్య చేసినట్లు అగుపించుచున్నది. బహుశా ఆయన తన శిష్యుల క్షేమము నిమిత్తమై వారి జాడలను వెంబడించుచుండి యుండవచ్చును (10:23పై గల వ్యాఖ్యానములను చూడు).

**ఆయన అక్కడ నుండి వెళ్లిపోయెను** మరియు ఇదే విధమైన ఇతర పదజాలములు రెండు విషయాలను జోడించుచుండు మాటలవలె మత్తయి వ్రాసిన సువార్తలో సాధారణంగా ప్రయోగింపబడినవి (12:9; 13:53; 15:29; 19:1). యేసు **వారి పట్టణములలో బోధించుటకును ప్రకటించుటకును** అచ్చోట నుండి వెళ్లిపోయాడు (4:23; 9:35పై గల వ్యాఖ్యానములను చూడు). "బోధించుట" మరియు "ప్రకటించుట" ఒకే విధముగా ఉన్నట్లు అగుపించుచుండినను, అవి వేర్వేరై యుండగలవు. "ప్రకటించుట" తన దృష్టిని ప్రధానంగా దేవుని వాక్యమును ప్రచురించుటపై కేంద్రీకరించును, "బోధించుట" ఎక్కువ సవిస్తరమైన వివరములను అందజేయును. ఈ సారాంశములో "స్వస్థపరచుట" యను ప్రక్రియ లేదని స్పష్టముగా గుర్తింపబడుచున్నది.

**వచనము 2. యోహాను చెరసాలలో వేయబడినాడని** మత్తయి వ్రాసిన సువార్తలో ముమ్మారు పేర్కొనబడుచున్నది (4:12–13; 11:2; 14:3–4). జోసీఫస్ ప్రకారము, హేరోదు అంతిపయ యోహానును మృతసముద్రమునకు తూర్పు దిశలో, దక్షిణమున నుండిన పెరియలోని మఖెరస్ కోటలో బంధించాడు.[3] మహా హేరోదు అధిపత్యము క్రింద ఉండిన అనేక కోటలలో ఇది ఒకటై యుండెను. తూర్పున నుండిన పాలస్తీనా దేశ పొలిమేరను కాపాడుట కొరకు ఈ కోట ఉపయోగింపబడినది. మైఖేల్ జే. విల్కిన్స్ ఇలా వ్రాయుచున్నాడు, "ఈ కోట యొక్క నామధేయమునకు బహుశా మఖెయ్ం, 'ఇరువైపుల పదునైన చాకు' అని అర్థమిచ్చు పదము మూలాధారమై యుండవచ్చును, మరియు అది సముద్ర మట్టమునకు ఏడు వందల మీటర్లు (1,600 అడుగుల) ఎత్తు వరకు నిట్టనిలువుగా నున్న ప్రక్కలు కలిగియుండి, మూడు వైపుల కూడ లోతైన కనుమల చేత కాపాడబడుచు, శిలామయమైన కొండ శిఖరము యొక్క పైభాగములో నున్నది."[4]

చతుర్థాధిపతియైన హేరోదు రాజు మరియు అతని వదిన, హేరోదియ మధ్య జరిగిన వావివరసల్లేని వివాహమును యోహాను బహు సాహసంతో బహిరంగముగా నిరసించినందుకు చెరసాలలో వేయబడెను (లూకా 3:19, 20; లేవీయకాండము 18:16 చూడు). ఆమె అతని మారుతల్లికి పుట్టిన సహోదరుడు, అరిస్టోబ్యులస్ యొక్క కుమార్తెయై యుండి, అతని సహోదరుడైన హేరోదు ఫిలిప్పును వివాహమాడిన స్త్రీయై యుండెను. రోమా పట్టణమునకు వెళ్లుచుండిన మార్గములో, హేరోదు అంతిపయ ఆమె చేత మరలుగొల్పబడినవాడై, ఆమెను చెరిపాడు, గనుక అటుతరువాత ఆయన తిరిగి తన ఇంటికి వచ్చినప్పుడు, తత్‌క్షణమే తన భార్యకు విడాకులిచ్చి, హేరోదియను వివాహమాడాడు. అతడు ప్రజలకు భయపడకుండినట్లయితే, హేరోదు యోహానును ఏనాడో హతమార్చేవాడు (14:5).

సుస్పష్టముగా, బాప్తిస్మమిచ్చు యోహాను **శిష్యులలో** కొందరు యేసు చేయుచుండిన కార్యకలాపములు పరివీక్షించుచు ఎప్పటికప్పుడు యోహానుకు సమాచారమందించుచుండినట్లు అర్థమగుచున్నది. యేసుతో కూడ వెళ్లుచుండినప్పుడు

(9:14), వారు ఆయనను ఉపవాసము గూర్చిన ఒక ప్రశ్న అడిగారు. ఇదియేగాక, యేసు నాయీను విధవరాలి కుమారుని లేపిన తరువాత, వారు “ఈ సంగతులన్నియు అతనికి [యోహానుకు] తెలియజేసిరి” (లూకా 7:18). **క్రీస్తు చేయుచున్న కార్యముల గూర్చి** వినుట వలన, ఆయనే క్రీస్తు అని నిర్ధారించుకొనుటకు తన శిష్యులను యేసు యొద్దకు పంపవలెనని యోహాను ప్రోత్సాహింపబడినాడు.

**వచనము 3**. యోహాను పంపిన సందేశము: **రాబోవు వాడవు నీవేనా, లేక మేము మరియొకని కొరకు కనిపెట్టవలెనా?** యేసు ఎవరైనది యోహాను ఎరిగియుండెను, ఏలయనగా వారిరువురు బంధువులై యుండిరి (లూకా 1:36). “ఇదిగో లోకపాపమును మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్ల!” అని పలుకుచు యోహాను యేసును అంగీకరించాడు (యోహాను 1:29) మరియు దేవుని ఆత్మ “పావురము వలె ఆకాశము నుండి” దిగివచ్చి ఆయన మీద నిలుచుటను కళ్లారా చూసాడు (యోహాను 1:32). యేసును గూర్చి చెప్పుచు, “ఆయన హెచ్చవలసి యున్నది, కానీ నేను తగ్గవలనని యున్నది” అని కూడ యోహాను ఘోషించాడు (యోహాను 3:30). అయితే యోహానుకు సందేహములు ఇప్పుడు వచ్చుటకు గల హేతువులేమై యుండును?

ఇందుకు అనేక సాధ్యతలున్నవి. బహుశా యోహాను సొంతం కొరకు కాదు, కానీ ఆయన శిష్యుల ప్రయోజనార్థమై ఈ ప్రశ్న లేవదీయబడియుండవచ్చును. యేసు శిష్యులతో కూడ చేరకూడదని తీర్మానించుకొని యోహాను అరణ్యములో ఎలుగెత్తి బోధించుచు, ముందుగానే ప్రవచనాత్మకముగా ప్రవచించి చెప్పిన సంగతులన్నిటిని (3:7–12) సంభవింపజేయుటకు యేసు ఎప్పుడు చర్య తీసికొనునో యని యోహాను తెలిసికొనగోరుట – ఇదొక సహనమునకు సంబంధించిన ప్రశ్న అడిగియుండవచ్చు అనునది మరొక దృక్పథమై యున్నది.

యోహాను పరిస్థితికి సంబంధించిన విషయము ఉత్తమమైన వివరమై యున్నది. ఆయన హేరోదు అంతిపయ చేసికొనిన వావివరసల్లేని వివాహమును బహిరంగముగా ఖండించి, అందునుబట్టి ఆ మీదట చెరసాలలో వేయబడినప్పుడు, సత్యమును చాటిచెప్పుటలో యోహాను నిర్భయుడును విశ్వసనీయమైనవాడునై యుండెను. అతనికి అనుమానం వచ్చియుండవచ్చును మరియు రానైయుండిన వాని నిమిత్తము మార్గమును సిద్ధపరచుటకు అభయం ఆయనకు అవసరమయ్యింది.

“ఎదురు చూడబడిన వాడు,” లేక “రాబోవు వాడు,” మెస్సీయాకు ఒక బిరుదై యుండెను, ఏలయనగా ఆయన రాకడ కొరకు ఇశ్రాయేలీయులు ఎంతో కాలంగా ఎదురుచూచుచుండిరి (కీర్తనలు 118:26). ఈ పదము యూదులలో అధిక సంఖ్యాకులకు సుపరిచితమైనదై యుండెను (మత్తయి 3:11; 21:9; 23:39; యోహాను 4:25; 6:14; 11:27; 12:13).

### యేసు ఇచ్చిన సమాధానము
### (11:4–6)

**[4]యేసు వారిని చూచి– మీరు వెళ్లి, విన్న వాటిని కన్నవాటిని యోహానుకు తెలుపుడి. [5]గ్రుడ్డివారు చూపుపొందుచున్నారు, కుంటివారు నడుచుచున్నారు, కుష్ఠరోగులు**

**శుద్ధులగుచున్నారు, చెవిటివారు వినుచున్నారు, చనిపోయినవారు లేపబడుచున్నారు, బీదలకు సువార్త ప్రకటింపబడుచున్నది. [6]మరియు నా విషయమై అభ్యంతరపడనివాడు ధన్యుడని యుత్తర మిచ్చెను.**

**వచనము 4.** యోహాను శిష్యులకు యేసు "ఔను" అని గాని "కాదు" అని గాని ఒక సమాధానమియ్యలేదు. దానికి బదులుగా, ఆయన వారికి అనుభవనీయమైన నిశ్చిత నిదర్శనమును సమకూర్చాడు. "ఆ గడియలోనే ఆయన రోగములను, బాధలను, అపవిత్రాత్మలునుగల అనేకులను స్వస్థపరచి; చాలామంది గ్రుడ్డివారికి చూపు దయచేసెను" అని లూకా గ్రంథస్థం గావించాడు (లూకా 7:21). అప్పుడు యేసు, **మీరు వెళ్లి విన్నవాటిని కన్నవాటిని యోహానుకు తెలుపుడి** అని యోహాను శిష్యులతో చెప్పాడు. "విన్నవాటిని మరియు కన్నవాటిని" అను పదముల వరుసక్రమము మత్తయి తన సువార్త నిర్మాణములో ఉపయోగించిన విధమును పోలియున్నది. మొదట, 5 మొదలుకొని 7వ అధ్యాయం వరకు ఆయన యేసు ఉపదేశములను ("వినుట") నివేదించాడు, వాటి వెనువెంట 8 మరియు 9వ అధ్యాయంలో యేసు చేసిన అద్భుతకార్యములను ("చూచుట") రచించాడు.[5] లూకా 7:22 ఈ వరుసక్రమమును తిరగేసి "కన్నవాటిని మరియు విన్నవాటిని" అని తెలియజెప్పుచున్నది.

**వచనము 5**. యోహాను శిష్యుల యెదుట యేసు చేసిన కార్యములు, మెస్సీయ వచ్చినప్పుడు ఆయన చేత చేయబడునని యెషయా ప్రవక్త ప్రవచించిన పనులై యున్నవి (యెషయా 29:18, 19; 35:5, 6; 61:1). ఈ అద్భుతకార్యములు మూడు జంటలుగా విభజింపబడి యున్నవి, మరియు అవి మత్తయి సువార్త 8వ మరియు 9వ అధ్యాయంలో నుండి సోదాహరణంగా వివరింపబడగలవు: (1) **గ్రుడ్డివారు చూపు పొందుట** (9:27–31) మరియు **కుంటివారు నడుచుట** (8:5–13; 9:2–8); (2) **కుష్ఠరోగులు స్వస్థతనొందుట** (8:1–4) మరియు **చెవిటివారు వినుట** (9:32–34 చూడు); (3) **మృతులైనవారు లేపబడుట** (9:18–26) మరియు **బీదలకు సువార్త ప్రకటింపబడుట** (9:35). యేసునకు తారతమ్యముగా, యోహాను తన పరిచర్య కాలములో ఏ అద్భుతకార్యములనైనను చేయలేదు (యోహాను 10:41).

**వచనము 6.** యేసు తన సమాధానమును ఒక ధన్యతతో ముగించాడు: **మరియు నా విషయమై అభ్యంతరపడనివాడు ధన్యుడు.** "అభ్యంతరపడుట" (*skandalizō*), "అడ్డు బండ" (*skandalon*) అని అనువదింపబడిన నామవాచకమునకు సంబంధించిన పదమై యున్నది. అనగా, యోహాను యేసు నందు విశ్వాసముంచుటకు మెస్సీయ సంబంధిత ఎదురుచూపుల గూర్చి ఆయన ముందుగానే తన మదిలో భావించుకొనిన భావాలు ఒక అడ్డుబండగా పనిచేయునట్లు వాటిని ఆయన అనుమతించకూడదని మరొక మాటలో చెప్పుకొనవచ్చును.[6]

యేసు ఎవడై యుండెనో లేదా ఆయన ఏమి చేసెనో అను దానినిబట్టి అనేకులు ఆయనను తృణీకరించారు. వారి అవగాహనకు అందని ఆయన ఉపదేశముల గూర్చి కొందరు శిష్యులు తొట్రిల్లారు కూడ, మరియు గనుక ఆయనను వెంబడించుట మానివేసారు (యోహాను 6:60, 61, 66). నజరేతు పట్టణము, అది తన స్వస్థలము, అచ్చటి వాస్తవ్యులు

యేసును “అభ్యంతరపరిచిరి.” ఆయన బోధించుచుండగా విన్నవారు, “ఈ జ్ఞానమును ఈ అద్భుతములు ఇతనికెక్కడ నుండి వచ్చినవి?” (13:54) అని ప్రశ్నించారు. అనేక మంది యూదులు సిలువవేయబడిన మెస్సీయను గూర్చిన వాస్తవమును అంగీకరించలేక పోయినందునుబట్టి, సిలువను గూర్చిన వార్త వారికి ఒక “ఆటంకముగా” నున్నదని పౌలు రచించాడు (1 కొరింథీయులకు 1:23; గలతీయులకు 5:11).

## యేసు యోహానును ప్రశంసించుట (11:7–15)

**[7]వారు వెళ్లిపోవుచుండగా యేసు యోహానునుగూర్చి జనసమూహములతో ఈలాగు చెప్పసాగెను –మీరేమి చూచుటకు అరణ్యములోనికి వెళ్లితిరి? గాలికి కదులుచున్న రెల్లునా? మరి ఏమి చూడ వెళ్ళితిరి? [8]సన్నపు బట్టలు ధరించుకొన్న మనుష్యునా? ఇదిగో –సన్నపు బట్టలు ధరించుకొనువారు రాజుగృహములలో నుందురు గదా. [9]మరి ఏమి చూడ వెళ్లితిరి? ప్రవక్తనా? అవునుగాని ప్రవక్తకంటె గొప్పవానినని మీతో చెప్పుచున్నాను.**

> **[10]–ఇదిగో నేను నా దూతను నీకు ముందుగా పంపుచున్నాను, అతడు నీ ముందర నీ మార్గమును సిద్ధపరచును అని యెవనిగూర్చి వ్రాయబడెనో అతడే ఈ యోహాను.**

**[11]స్త్రీలు కనినవారిలో బాప్తిస్మమిచ్చు యోహానుకంటె గొప్పవాడు పుట్టలేదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. అయినను పరలోకరాజ్యములో అల్పుడైన వాడు అతనికంటె గొప్పవాడు. [12]బాప్తిస్మమిచ్చు యోహాను దినములు మొదలుకొని యిప్పటి వరకు పరలోకరాజ్యము బలాత్కారముగా పట్టబడుచున్నది, బలత్కారులు దాని నాక్రమించుకొనుచున్నారు. [13]యోహాను కాలము వరకు ప్రవక్తలందరును ప్రవచించుచువచ్చిరి; ధర్మశాస్త్రము సహా ప్రవచించుచునుండెను. [14]ఈ సంగతి నంగీకరించుటకు మీకు మనస్సుంటే రాబోవు ఏలీయా యితడే. [15]వినుటకు చెవులుగలవాడు వినుగాక.**

**వచనము 7.** యేసు ఇచ్చిన సమాధానమును వినుకొనిన తరువాత, యోహాను యొద్ద నుండి వచ్చిన ఈ వార్తాహరులు అచ్చటి నుండి నిష్క్రమించారు. అప్పుడు యేసు జనసమూహము వైపు తిరిగి, **మీరేమి చూచుటకు అరణ్యములోనికి వెళ్లితిరి? గాలికి కదలుచున్న రెల్లునా?** అని వారినడిగాడు. యోహాను బోధలు వినవలెననియు అటుతరువాత ఆయన చేత బాప్తిస్మము పొందవలెననియు యూదులు మిట్టపల్లాలున్న విశాలమైన ప్రదేశములలో అనేక మైళ్ల తరబడి తండోపతండలుగా పయనించి వచ్చారు (3:5, 6). అది స్వయంవిదితమై యున్నట్లుగా, యోహాను అరణ్యములో గాలికి కదలుచుండి, మారిపోవుచుండు ప్రతి ప్రవాహంతో పాటు ఊగిసలాడుచుండిన ఒక రెల్లు కాదు. దానికి మారుగా, యోహాను ఒప్పింపగలవాడును సాహసవంతుడునై యుండెను. వారి వేషధారణనుబట్టి ఆయన పరిసయ్యులను సద్దూకయ్యులను ధైర్యముతో గద్దించాడు (3:7–10). అంతమాత్రమేగాక, హేరోదు అంతిపయ న్యాయసమ్మతముగా కాని వివాహము చేసికొనిన కారణాన్నిబట్టి యోహాను అతనిని ముఖాముఖిగా ఎదుర్కొన్నాడు. వాస్తవమునకు, యోహాను చెరసాలలో వేయబడుటకుగల హేతువు ఇదే (14:3–5).

**వచనము 8.** ఆ తరువాత, ఆ ప్రజలు **సన్నపు బట్టలు ధరించుకొన్న మనుష్యుని**

కలిసికొనుటకు వెళ్లారేమో అని యేసు అడిగాడు. “సన్నపు బట్టలు” (*malakos*) అను పదము నానా విధములుగా దండాన్వయము చేయబడినది, “వెల యెక్కువైన బట్టలు” (NLT), “ఆకర్షణీయమైన వస్త్రములు” (TEV), మరియు “పట్టు వస్త్రములు” (NEB). మరొసారి, “కాదు” అను సమాధానము ఈ ప్రశ్నకు స్పష్టమైన జవాబై యుండినది. దానికి బదులుగా, యోహాను “ఒంటె రోమముల వస్త్రమును, మొలచుట్టు తోలు దట్టియు ధరించుకొని యుండెను” (3:4). ఆయన వస్త్రధారణ ఒక ప్రవక్త (2 రాజులు 1:8; జెకర్యా 13:4) మరియు ఎటువంటి జీవనాధారములేని వాడు ధరించునటువంటిదై యుండినది.[7]

ఆ తరువాత యేసు, **ఇదిగో, సన్నపు బట్టలు ధరించుకొనువారు రాజగృహములో నుందురు గదా!** అని వారితో చెప్పాడు. ఇటువంటి వారిలో రాజులు, విచ్చలవిడిగా స్వయం కోరికలను అతిగా తీర్చుకొనుటలో పేరుగాంచినవారే, మరియు పొగడ్తల విషయంలోను నైతికంగా రాజీపడుటలోను పేరుగాంచిన రాజపరివార సభ్యులందరు చేరియుండిరి. యోహాను వ్యతిరేకించుచుండినది, ఈ విలక్షణతలనే.

**వచనములు 9, 10**. యేసు అడుగుచుండిన ప్రశ్నల పరంపరలో మూడవ ప్రశ్నగా, **మరి ఏమి చూడ వెళ్లితిరి? ప్రవక్తనా?** అని వారినడిగాడు. ఈ సందర్భములో, సమాధానము ‘ఔను’గా నిశ్చయార్థకమైనదై యుండినది. యోహాను నిజముగా **ఒక ప్రవక్తయై** యుండెను, కానీ ఆయన **అంతకు ఎంతో మించినవాడై** యుండెను.

యేసు మలాకీ గ్రంథంలో నుండి తీసికొని చెప్పిన ఉల్లేఖనము నిరూపించుచున్నట్లు (మలాకీ 3:1), యోహాను, మెస్సీయ కొరకు మార్గము సిద్ధపరచుటకు వచ్చునని ప్రవచింపబడినవాడై యుండెను.[8] ఆయన రాబోవువాడై యుండిన ఏలీయాయై యుండెను (మలాకీ 4:5; మత్తయి 11:14).

**వచనము 11. స్త్రీలు కనినవారిలో, యోహాను కంటె గొప్పవాడు పుట్టలేదని** యేసు సెలవిచ్చాడు. “స్త్రీలు కనినవారిలో” అను పదజాలము ఒక హెబ్రీయ జాతీయమై యుండి, “మానవ జాతి” అను సామాన్య అర్థము నిచ్చుచున్నది (యోబు 14:1; 15:14; 25:4 చూడు). ఆయన, మెస్సీయకు ముందుగా వచ్చుచుండిన దూతగా ఆయన వహించుచుండిన పాత్ర దృష్ట్యా, ఎప్పుడైనా జీవించినవారందరిలోను అత్యంత గొప్పవాడై యుండెను (లూకా 1:14-16 చూడు). సహజంగానే, పై ఘోషణలో యేసు మినహాయింపబడి యున్నాడు, ఏలయనగా ఆ మెస్సీయ ఆయనే అయియుండెను. యేసు జన్మము ఆశ్చర్యజనకమైన గర్భధారణ ఫలితమై యున్నప్పటికిని (1:20పై గల వ్యాఖ్యానము చూడు), ఆయన కూడ, “స్త్రీయందు పుట్టినవాడై” యున్నాడు (గలతీయులకు 4:4-5).

**అయినను పరలోక రాజ్యములో అల్పుడైనవాడు**[9] **అతని కంటె గొప్పవాడని** పలుకుచు యేసు తన మాటలను కొనసాగించాడు. ఇదెలా సాధ్యమౌతోంది? పరలోక రాజ్యము సమీపించి యున్నదని యోహాను ప్రకటించినప్పటికిని, ఆయన ఎన్నడను ఆ రాజ్య పౌరుడై యుండలేదు. పెంతెకొస్తు దినాన ఆ రాజ్యము వ్యవస్థాపింపబడక మునుపే ఆయన మరణించాడు. యోహాను ఆనందానుభూతి చెందిన వాటిని మించిన గొప్ప ఆశీర్వాదములను మరియు విశేషాధికార హక్కులను క్రైస్తవ యుగము కలిగియున్నది.[10]

**వచనము 12. బాప్తిస్మమిచ్చు యోహాను దినములు మొదలుకొని యిప్పటి వరకు పరలోక రాజ్యము బలత్కారముగా పట్టబడుచున్నది,** బలాత్కారులు దాని నాక్రమించుకొనుచున్నారు.

వ్యవస్థాపింపబడి ఇప్పటి వరకును ఉనికిలోనికి రాని రాజ్యము "బాప్తిస్మమిచ్చు యోహాను దినములు మొదలుకొని" అప్పటికి వరకు బలాత్కారమునకు ఎలా గురౌతోంది? రాజ్యము రానప్పటికిని, అది దాని సిద్ధపాటు దశలో ఉండినది. "బాప్తిస్మమిచ్చు యోహాను దినములు" ఆయన బహిరంగముగా పరిచర్య చేయుచుండిన కాలమును సూచించుచున్నవి. యోహాను ప్రకటించుచుండిన సందేశమును వైరభావముతో ఎదుర్కొనబడినది, గనుక ఆయన జీవితము త్వరలోనే దుష్టుల చేతిలో బలాత్కారముగా అంతముకానుండినది (14:3–12). వారు ప్రకటించుచుండిన సందేశములకు వారిలో కొందరు బలాత్కారముతో కూడిన ప్రతిస్పందనలు ఎదుర్కొందురని యేసు తన అపొస్తలులను హెచ్చరించారు (10:16–20). ఆయన సొంత పరిచర్యయే బలత్కారముతో కూడిన వ్యతిరేకతను తెచ్చిపెట్టినది గనుక అది ఆయన మరణముతో అంతమయ్యింది (26:55–57, 65–68; 27:26, 30, 33–35, 50).

ఈ వచనములోని భాగములు అనువదింపబడుటకు కష్టముగా నున్నవి. "బలాత్కారముగా పట్టబడుట"కు సంబంధించిన గ్రీకు నిర్మాణము (*biazō* నుండి వచ్చినది) కర్మణి ప్రయోగముగా లేదా భావవాచి ప్రయోగముగా అనువదింపబడవచ్చును. అది కర్మణి ప్రయోగముగా ("బలాత్కారముగా పట్టబడును") పరిగణింపబడినట్లయితే, ప్రజలు బాప్తిస్మమిచ్చు యోహానును మరియు యేసును వ్యతిరేకించిన సందర్భములలో వలెనే, బలాత్కారము రాజ్యమునకు విరోధముగా వెలుపల నుండి తీసికొని రాబడినదని అర్థము. అది భావవాచి ప్రయోగముగా ("బలాత్కారముగా వచ్చుచున్నది"), పరిగణింపబడినట్లయితే, రాజ్యము పరిచయము చేయబడుచుండినప్పుడే, ప్రజలు వారి బలమును ప్రయోగించుచు అందులోనికి ప్రవేశించుచుండిరని అర్థము.

ఈ రెండవ దృశ్య వివరణ రాజ్యమును "చుట్టూర ముట్టడింపబడియున్న" పట్టణము యొక్క గోడల మీదికి ప్రజలు దొమ్మిగా వచ్చుచు లోనికి ప్రవేశించుటకు వారి బలమును ప్రయోగించుచున్నది. రాజ్యము, అపార్థము చేసికొనబడినప్పటికిని, అభినందన పలుకులతో కూడిన గొప్ప ఆతురతతో అది ఆహ్వానింపబడినది. కొందరైతే దాని వెలువరింతను వేగవంతము చేయుటకు ప్రయత్నించారు; ఇతరులు దానిలో ప్రాముఖ్యతను సంపాదించుకొనునట్లు ముందుకు తోసుకొని వెళ్లవలెనని ఆశించారు (20:21; లూకా 16:16; 19:11; 22:24–30; యోహాను 6:15; అపొస్తలుల కార్యములు 1:6). ఈ రెండు అనువాదములలోని మొదటి వ్యతిరేకార్థమైనదై యున్నది, రెండవది నిశ్చయాత్మకమైనదై యున్నది. రాజ్యము బలాత్కారముగా వచ్చుట దాని భావమై యుండును.

**వచనము 13**. ఈ సమయంలో, పాత నిబంధనకును క్రొత్త నిబంధనకును మధ్య **యోహాను** వహించిన మధ్యంతర పాత్రను యేసు ఉద్ఘాటించాడు. **ప్రవక్తలందరును ... ధర్మశాస్త్రము** సహా అను పదజాలమును ప్రయోగించుచు, యేసు సర్వసాధారణ వరుసక్రమమును, "ధర్మశాస్త్రమును ప్రవక్తలును" అను పదజాలమును తిరగేసాడు (5:17; 7:12; 22:40 చూడు). ప్రవచన నెరవేర్పు యోహాను అయియుండెనను సత్యమును నొక్కిచెప్పుటకు ఆయన ఈ పని చేసియుండవచ్చును. ప్రవక్తల స్వరములు దాదాపుగా నాలుగు వందల సంవత్సరములు మౌనమైపోయాయి. మలాకీ, పాత నిబంధన ప్రవక్తలలోని చివరివాడు, యోహాను రాకడ గూర్చి ముందుగా తెలియజెప్పాడు (11:9,

10పై గల వ్యాఖ్యానములను చూడు). సాముదాయికంగా, ప్రవక్తలు యోహాను రాకడను చుట్టిముట్టియుండిన సంఘటనలను సూచించారు. యోహాను, " 'ప్రభువు మార్గము సిద్ధపరచుడి, ఆయన త్రోవలు సరాళము చేయుడని' అరణ్యములో కేకవేయు నొకని శబ్దమై" యుండెను (3:3; యెషయా 40:3 చూడు). యోహాను రాకతో మరియు ఆయన తరువాత వచ్చినవానితో, ఆ ప్రవచనములన్నియును నెరవేరనై యుండినవి. రాజ్యము రాకడ గూర్చి ధర్మశాస్త్రము మరియు ప్రవక్తలు కూడ ముందుగా తెలియజెప్పినది (దానియేలు 2:44), యోహాను మరియు యేసు కూడ "సమీపముగా నున్నది" అని ప్రకటించారు (3:2; 4:17).

**వచనము 14.** యేసు యోహానును **రాబోవుచుండిన ఏలీయాగా** గుర్తించాడు. ఇది మలాకీ 4:5లో వ్రాయబడిన, "ఇదిగో, యెహోవా నియమించిన భయంకరమైన ఆ మహా దినము రాక మునుపు నేను ప్రవక్తయగు ఏలీయాను మీ యొద్దకు పంపుదును" అను ప్రవచనము యొక్క నెరవేర్పై యుండినది. ప్రవచనము మరియు ఏలీయా శారీరక మరణము నొందలేదను వాస్తవము (2 రాజులు 2:11, 12) ఆధారంగా, అక్షరాలా ఏలీయా ఇహమునకు తిరిగి వచ్చునని యూదులు ఎదురుచూచుచుండిరి.[11] అతడే అక్షరాలా ఏలీయాయై యుండెనను విషయాన్ని యోహాను అంగీకరించలేదు (యోహాను 1:21), కానీ యేసు అతనిని మలాకీ గ్రంథంలో ప్రవచింపబడిన "ఏలీయా"గా గుర్తించాడు (17:10–13; మార్కు 9:11–13 చూడు). యోహాను నిజముగా "ఏలీయా యొక్క ఆత్మయు శక్తిగలవాడై" వచ్చాడు (లూకా 1:17).

యోహానే "ఏలీయా" యై యున్నాడని **అంగీకరించుటకు** ప్రతి ఒక్కరు ఇష్టపడరని యేసు గుర్తించాడు. అక్షరార్థ ఏలీయా తిరిగి వచ్చుట గూర్చి వారిలో ముందుగానే ఏర్పరచుకొనబడిన భావాలు, యోహాను చెరసాలలో ఉన్నాడను వాస్తవముతో కలిసి, వారి అవగాహనకు అందుటకు కష్టము కలిగించి యుండవచ్చును. వారు ఈ గుర్తింపును అంగీకరించుటకు ఇవి అడ్డుబండలై యుండవచ్చును (11:6పై గల వ్యాఖ్యానములను చూడు).

**వచనము 15.** ఆయన శ్రోతలు వినునట్లు ఈ వివరమును యేసు ఒక మందలింపుతో ముగించాడు: **వినుటకు చెవులుగలవాడు వినునుగాక**. యేసు వ్యక్తము చేసినది మరియు ఇటువంటి విషయాలు సమదృక్పథ సువార్తలలోను ప్రకటన గ్రంథంలోను కనబడుచుండును (13:9, 43; మార్కు 4:9, 23; లూకా 8:8; 14:35; ప్రకటన 2:7, 11, 17, 29; 3:6, 13, 22; 13:9). ఒకడు చెవులకు వినబడు మాటలను వినుట మాత్రమేగాక, విధేయతతో కూడిన విశ్వాసము ద్వారా అవి అతని జీవితమును మార్చునట్లు అతడు వాటిని అనుకూలించుకొనవలెను.

## ప్రజలు యోహాను మరియు యేసు యెడల ప్రదర్శించిన ప్రతిస్పందనలు (11:16–19)

**16ఈ తరమువారిని దేనితో పోల్చుదును? సంత వీధులలో కూర్చునియుండి–**
**17మీకు పిల్లనగ్రోవి ఊదితిమిగాని మీరు నాట్యమాటరైతిరి; ప్రలాపించితిమి గాని**

**మీరు రొమ్ము కొట్టుకొనరైతిరని తమ చెలికాండ్రతో చెప్పి పిలుపులాటలాడుకొను పిల్లకాయలను పోలియున్నారు. [18]యోహాను తినకయు త్రాగకయువచ్చెను గనుక–వీడు దయ్యముపట్టినవాడని వారనుచున్నారు. [19]మనుష్యకుమారుడు తినుచును త్రాగుచును వచ్చెను గనుక–ఇదిగో వీడు తిండిబోతును మద్యపానియు సుంకరులకును పాపులకును స్నేహితుడునని వారనుచున్నారు. అయినను జ్ఞానము జ్ఞానమని దాని క్రియలనుబట్టి తీర్పుపొందుననెను.**

**వచనము 16. ఈ తరమువారిని దేనితో పోల్చుదును**? "తరము" (*genea*) అను పదము ఒక నిర్దిష్ట కాలములో జీవించుచున్నవారిని సూచించుచున్నది. యేసు తన సమకాలికులను, ముఖ్యముగా ఆయనను తృణీకరించినవారిని, సూచించుటకు తరుచుగా ఈ పదమును ప్రయోగించాడు (12:39, 41, 42, 45; 16:4; 17:17; 23:36; 24:34). ఈ సందర్భములో, ఆయన తన కాలము నాటి ప్రజలను **పిల్లలతో**, విశ్వాసములో పరిపూర్ణ పరిపక్వతచెందని వారితో పోల్చాడు. వారు తలిదండ్రులు కొనుగోలు చేయుటకు అంగట్లోకి లేదా స్నేహితులను లేక బంధుమిత్రాదులను కలిసికొనుటకు వారి గృహములకు వెళ్లినప్పుడు **సంతవీధులలో** ఆటలాడుకొనుచుండు పిల్లల వలె ఉండిరి.

**వచనము 17**. పిల్లలు ఒక గుంపుగా కూడుకొని ఆటలాడుకొనుచు, వారి స్నేహితులను పిలుచుచు, వారితో సహకరించనట్లయితే వారిని విమర్శించుచుండిన పరిస్థితిని యేసు చక్కగా చిత్రీకరించుచున్నాడు. పిల్లనగ్రోవి ఊదబడినప్పుడు, వివాహ మహోత్సవ సంబర సమయములో వలె, సహకరించని స్నేహితులు **నాట్యమాడుటకు** చేరరైరి. వారు ఆటలను ఆపివేసి అంత్యక్రియల **ప్రలాప పాటలు** పాడుటకు మొదలుపెట్టినప్పుడు, ఈ స్నేహితులు యింకను పాల్గొనరైరి, అనగా, వారు **ప్రలాపించలేదు**. ఎవరైనా మరణించినప్పుడు వృత్తిపరంగా ప్రలాపించుచుండు స్త్రీలు తరుచుగా అద్దెకు పిలువబడుచుండిరి (9:23 పై గల వాఖ్యానములను చూడు). ఇంతేగాక, అంత్య క్రియల ఊరేగింపును దాటి వెళ్లుట తటస్థించినవారు ఈ ప్రలాపములో పాల్గొనవలెనని కోరబడిరి.[12]

అనుదిన జీవితములో నుండి ఉదహరించి చెప్పబడిన ఈ సామాన్య సోదాహరణము యూదులు యోహానును మరియు యేసును అంగీకరించిన విధానమును వర్ణించుటకు ఉపయోగింపబడినది. దేవుడు పంపిన ఈ ఇరువురు సందేశకులతో వారు ఎవ్విధంగానైనను సహకరించరైరి.

**వచనము 18. యోహాను** వారి కొరకు వచ్చిన యూదుల తరము ఆధ్యాత్మిక అవగాహన లేనిదై యుండినది. వారు యోహాను యొక్క సర్వసామాన్యమైనదికాని మరియు కఠినమైన నియమముతో కూడిన జీవన శైలినిబట్టి ఆయనను తృణీకరించారు. యోహాను **తినకయు త్రాగకయు వచ్చెను**, యోహాను ద్రాక్షారసమును త్రాగలేదనియు (లూకా 1:14–16), ఆయన సామాన్య ఆహారము "మిడతలు మరియు అడవి తేనెయై" (3:4) యుండినదను వాస్తవమును ఇది సూచించుచున్నది. వారు ఉపవాసము చేయవలెనని కూడ యోహాను తన శిష్యులకు ఆదేశమిలిచ్చాడు (9:14). ఆయన సందేశము బహు పౌరుషమైనదియు గంభీరమైనదియునై యున్నందునుబట్టి దానిని ఆ తరము తృణీకరించినది. వారు ఉదాసీనముగా ఉండుటను ఆయన ఎట్టి పరిస్థితులలోనైనను అనుమతించలేదు, కానీ ప్రజలందరును మారుమనస్సు

నొంది బాప్తిస్మము పొందవలెనని వారికి పిలుపునిచ్చాడు (3:2, 6; మార్కు 1:4). తత్ఫలితంగా, ఆయన **దయ్యము** పట్టినవాడని వారు ఆయనను నిందించారు.[13]

యేసు ఆయన తరము వారి గూర్చి మాటలాడినప్పుడు, ప్రధానంగా మతపరమైన నాయకులు ఆయన మనస్సులో ఉండినట్లు అగుపించుచున్నది. లూకా వ్రాసిన సువార్తలో వ్రాయబడి యున్న సమాంతర కథనములో యోహాను బాప్తిస్మము పొందిన సామాన్య ప్రజలకును (సుంకము వసూలు చేయుచుండినవారితో కూడ), బాప్తిస్మము పొందుటకు నిరాకరించి, తద్వారా వారి జీవితములలో గల దేవుని చిత్తమును తృణీకరించిన పరిసయ్యులు మరియు న్యాయాధిపతులకును మధ్య గల తారతమ్యమును తెలుపుచు నిక్షిప్తమై యున్న ఒక వ్యాఖ్యానము కలిసియున్నది (లూకా 7:29, 30; మత్తయి 21:32 చూడు).

**వచనము 19.** ఆ తరమువారు యేసును, **మనుష్యకుమారుడు** అని ఇచ్చట గుర్తింపబడినవానిని కూడ తృణీకరించారు. ఆయన **తిండిబోతును మద్యపానియునై** యున్నాడని వారు ఆయనను నిందించారు (ద్వితీయోపదేశకాండము 21:20 చూడు).[14] ఈ అబద్ధ ఆరోపణలు, వాస్తవముల గూర్చిన నీచపు నివేదనలై యుండినవి. ఆయన అనుచరులు సాంప్రదాయికమైన యూదా ప్రజల ఉపవాసములలో పాల్గొనవలెనని యేసు ఆజ్ఞాపించలేదు (9:14), గనుక సామాన్య ప్రజలు వారి ఇళ్లలో ఏర్పాటుచేసిన విందు భోజనములకు (9:9, 10; 26:6, 7; లూకా 7:36; 10:38; 14:1; 19:5), మరియు వివాహముల వంటి ఇతర వేడుకలకు (యోహాను 2:1-11) అందజేసిన అనేక ఆహ్వానములను ఆయన అంగీకరించాడు. యోహాను అతని ఐహిక సుఖములను విడిచిన జీవిత విధానమునుబట్టి విమర్శింపబడినాడు, యేసు సామాన్య జీవిత కార్యకలాపములలో పాల్గొనుచుండుటనుబట్టి విమర్శింపబడినాడు.

ఆయన తన పరిచర్యను కొనసాగించుచు, సామాన్య జనులతో కలిగియుండిన సంబంధములనుబట్టి కూడ వారు యేసును ఎగతాళి చేయుచు, ఆయనకు **సుంకరులకును పాపులకును స్నేహితుడని** ముద్రవేసారు (9:11పై గల వ్యాఖ్యానములను చూడు). సహజంగానే, వారి దుష్ట చర్యలలో పాల్గొనుటకు కాదు, కానీ వారికిని దేవునికిని గల సంబంధమును పునరుద్ధరించవలెనను ఉద్దేశముతో యేసు ఇటువంటి ప్రజలతోను సహవసించాడు. ఈ విషయాన్ని లూయిస్ ఇలా వ్యక్తము చేయుచున్నాడు, "ఇతరులు 'ధార్మిక చింతనగలవారు' అను పేరుతో – వేర్పాటువాదులు (పరిసయ్యులు), లేక 'వెలుగు పిల్లలు' (ఎస్సేనీయులు), పరిశుద్ధ శేషమై యుండుటకు ప్రయత్నించుచుండినవారు, – వేర్పాటు గుంపులను ఏర్పరచుకొనుచుండగా, యేసు జనసమూహముల మధ్యకు వెళ్లాడు, నశించినవారితో కలిసి కార్యములు చేసాడు."[15]

**అయినను జ్ఞానము జ్ఞానమని దాని క్రియలనుబట్టి తీర్పుపొందును** అని చెప్పుచు యేసు తన ప్రస్తుత సందేశమును సమాప్తము చేసాడు. పాత నిబంధనలో ఉన్నట్లుగా, "జ్ఞానము" (*ophia*) ఒక స్త్రీగా మూర్తీకరణము గావింపబడుచున్నది (సామెతలు 8; 9 చూడు). "ఆమె క్రియలు" అనుటకు బదులుగా లూకా "ఆమె పిల్లలు" అని వ్రాసియున్నాడు (7:35). ఏదిఏమైనా, విషయము అనివార్యముగా అదే. వారిని గూర్చి మనుష్యులు చెప్పుకొనిన దానితో నిమిత్తము లేకుండా, యేసు మరియు యోహాను, సమస్త మానవులు మారుమనస్సు నొంది రానైయుండిన రాజ్యమునకు తమ్మునుతాము సిద్ధపర్చుకొనునట్లు వారికి పిలుపు

నిచ్చుటకై దేవుడు తన కటాక్షము చొప్పున వేసిన ప్రణాళికలో వారు వహించవలసి యుండిన పాత్రలను చక్కగా నెరవేర్చారు. వారు "మార్చిన" ప్రజలు – ఎవరి జీవితములైతే సమగ్రముగా మార్పునొందినవో, వారు – వారి కార్యకలాపములను సమర్థవంతుగా సమర్థించారు. పరిసయ్యులు మరియు ఇతర విమర్శకులు దేవుని జ్ఞానమును అంగీకరించకపోగా, ఆధ్యాత్మికముగా జ్ఞానులైయుండినవారు రాజ్యమును గూర్చిన ఉపదేశములకు వారి హృదయములను బాహాటముగా తెరిచారు. లూకా వ్రాసిన సువార్తలో, జ్ఞానము యొక్క "పిల్లలతో" పోల్చబడినప్పుడు కొట్టవచ్చిన తారతమ్యములో నిలుచున్నారు (లూకా 7:32, 35).

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

## క్రీస్తు తన ఉపదేశములను కొనసాగించుచున్నాడు (అధ్యాయము 11)

మత్తయి వ్రాసిన సువార్త 11వ అధ్యాయంలో ఆరు సత్యములున్నవి: (1) గొప్పతనమును కొలుచుటకు గల దేవుని ప్రమాణమునకును మన సొంత ప్రమాణమునకును ఎంతో వ్యత్యాసమున్నది (11:1–6). (2) వెలుపలి ఆకృతులు తరుచుగా వంచించునవై యుండును (11:7–10). (3) మనము దేవుని కొరకు చేయు పనుల విలువను మనము ఎన్నడును తక్కువ అంచనా వేయకూడదు (11:11–15). (4) మనుష్యులలో అధిక సంఖ్యాకులు అసలైన సత్యమార్గములు ఆశించారు (11:16–19). (5) క్రీస్తు మనకు తీర్పు తీర్చును (11:20–24). (6) క్రీస్తు కనికరముగలవాడై, ఆయన యొద్దకు వచ్చువారిని క్షమించుటకు సిద్ధమనస్సుగలవాడుగా సిద్ధపడి యున్నాడు (11:25–30).

## బాప్తిస్మమిచ్చు యోహాను (11:2–6)

యోహాను ఒంటె రోమముల వస్త్రము ధరించిన బోధకుడై యుండెను (3:4). బాప్తిస్మమిచ్చు యోహానును అర్థంచేసికొనుటకు, ఆయన నేపథ్యం గూర్చి మనము కొంత తెలిసికొని యుండవలెను. ఆయన జన్మనెత్తక మునుపే ప్రత్యేకమైనవాడై యుండెను (లూకా 1:1–25, 41, 57–66). ఆయన కేవలము జిజ్ఞాస కలిగించెడు ఒక అంశమై యుండలేదు; అతడు ఏదో ఎబ్బెటుగా నుండెనని మనలను ఆలోచింపజేయు అతని గుణ గణములు వాస్తవమునకు పాత నిబంధన ప్రవక్తలనుసరించిన సాంప్రదాయము లోపలనే యుండెను (యెషయా 40:3–5; మలాకీ 3:1; 4:5, 6). ఆయన చేయవలసి యుండిన పనులు వరస ద్వితీయ స్థానంలో ఉండవలసి యుండినది, ప్రథమ స్థానంలో కాదు – పెళ్లికుమారుని స్నేహితుడు, కానీ పెళ్లికుమారుడు కాదు (3:11; యోహాను 3:29, 30). ఆయన క్రీస్తు కాదు (లూకా 3:15–17); మెస్సీయ కొరకు మార్గమును సిద్ధపరచుట, ప్రజలు హృదయములను సిద్ధపరచుట, వెలుగును గూర్చి సాక్ష్యమిచ్చుట ఆయనకు అప్పగింపబడిన బృహత్కార్యభారమై యుండినది (యోహాను 1:1–18, 29–34). ఆయన సందేశము అతి సామాన్యమైనది: "మారు మనస్సు నొందుము, ఏలయనగా పరలోక రాజ్యము సమీపించి యున్నది" (3:2). ఆయన "పాపక్షమాపణ నిమిత్తము మారుమనస్సు విషయమైన బాప్తిస్మము" గూర్చి ప్రకటించాడు (మార్కు 1:4) మరియు యేసు, రాజ్య

సువార్తను ప్రకటించునట్లు ఆయన కొరకు మార్గమును సిద్ధపర్చాడు (మార్కు 1:14, 15). మనము కలిగియున్న విశ్వాసమును మనము గంభీరముగా పరిగణించవలెనని యోహాను ప్రదర్శించాడు. మనము ఏదో "మొక్కుబడి తీర్చుకున్నట్లుగా నిజాయితీలేని సేవ" చేయుటతో సంతృప్తిచెంది యుండకూడదు; మనము ప్రభువును మాటతోను క్రియలతోను సేవించవలెను.

## సందేహములను తీర్చుకొనుట (11:2-6)

జీవితములో ఏదో ఒక సమయంలో, దాదాపుగా ప్రతి క్రైస్తవుడు సందేహములతో వ్యవహరించును. ఇవి తరుచుగా ఆర్థిక ప్రయాసములు, సంబంధములలో ఏర్పడు సంఘర్షణలు, ఆరోగ్య సమస్యలు, మరియు ప్రియులైనవారి మరణము వంటి తీవ్రమైన పరీక్షల వలన కలుగును. అనుమానములు మనలను ఆశ్చర్యపరచకూడదు; ఇంత గొప్ప బలమైన స్తంభముగా నిలిచియుండిన యోహాను సహితము ఆయన చెరసాలలో ఉన్నప్పుడు సందేహములకు గురయ్యాడు. మనకు కలుగు అనుమానాలు గూర్చి మనము నిజాయితీగా ఉంటూ వాటిని క్రీస్తునొద్దకు తీసికొని వెళ్లుట ద్వారా యోహాను చూపిన మాదిరిని అనుసరించవలెను. ఎంతైనా, మన సందేహములను తొలగించుటకు యేసు క్రీస్తు ఒక్కడే సమర్థవంతమైనవాడై యున్నాడు. బహుశా మనము దయ్యము పట్టిన కుమారుని తండ్రి చేసిన ప్రార్థన చెప్పుకొనుచుండవలసి యుండును: "(ప్రభువా,) నేను నమ్ముచున్నాను; నా అపనమ్మకమును నేను జయించునట్లు నాకు సహాయము చేయుము!" (మార్కు 9:24; NIV).

డేవిడ్ స్టూవర్ట్

---

సూచనలు

[1]Leon Morris, *The Gospel according to Matthew,* Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 272. [2]Jack P. Lewis, *The Gospel According to Matthew,* Part 1, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1976), 158. [3]యోహాను "హేరోదు యొక్క సందేహాత్మక భావోద్రేకము" మూలమును మఖెయ్‌రస్ కోటలో హతమార్చబడినాడని జోసీఫస్ గుర్తించాడు (Josephus *Antiquities* 18.5.2). [4]Micheal J. Wilkins, "Matthew," in Zondervan Illustrated Bible Backgrounds Commentary, vol. 1, *Matthew, Mark, Luke*, ed. Clinton E. Arnold (Grand Rapids, Mich.: Zondervan, 2002), 72; Josephus *Wars* 7.6.2 చూడు. [5]Donald A. Hagner, *Matthew 1-13,* Word Biblical Commentary, vol. 33A (Dallas: Word Books, 1993), 300 చూడు. [6]Morris, 277. [7]Josephus *Wars* 1.24.3. [8]యేసు ఉల్లేఖనము మలాకీ 3:1 నుండి అనుకూలింపజేసికొనబడినది. "నాకు" అను సర్వనామము ("ప్రభువును" ప్రస్తావిస్తూ) "నీకు" (ఆయన యొక్క మెస్సీయను సూచిస్తూ) అని మార్చబడినది. [9]మత్తయి 5:19; 10:42; 18:1-4; 20:25-28; 25:40, 45 చూడు. [10]Lewis, 161.

[11]Sirach 48:1, 10; Mishnah *Eduyoth* 8.7; *Sotah* 9.15 చూడు. కొందరు యేసును ఏలీయా అని పొరపాటుగా గుర్తించారు (16:14), ఆయన సిలువవేయబడుచుండిన సమయంలో ఏలీయా రావలెనని యేసు ఏలీయాను పిలుచుచుండెనని ఇతరుల తప్పుడు ధోరణిలో ఆలోచించారు (27:46, 47). [12]Josephus *Against Apion* 2.27. [13]యేసు దయ్యము పట్టినవాడని కూడ నిందింపబడినాడు (9:34; 10:25; 12:24; యోహాను 7:20; 8:48, 52; 10:20). [14]బైబిల్ కాలములోని ద్రాక్షారసం గూర్చిన సమాచారము కొరకు, Duane F. Watson, "Wine," in *Dictionary of Jesus and the Gospels,* ed. Joel B. Green and Scot McKnight (Downers Grove, III.: InterVarsity Press, 1992), 870-73 చూడు. [15]Lewis, 163.